# ది పర్‌ఫెక్ట్ వైఫ్

"ఏమిటండీ ఇవన్నీ" అన్నది మా ఆవిడ నేను తెచ్చిన ఆ చిత్రపటాలన్నింటిని వుద్దేశించి. "ఇన్ని బొమ్మల పుస్తకాలు ఎక్కడివండీ. అబ్బో! అట్టలమీద అతికించారే కొన్ని" అన్నది మళ్ళీ.

"తెచ్చాను నీ కోసం చూడు ఎంచక్కని బొమ్మలో!"

"యివన్నీ కొన్నారా ఏమిటి కొంపతీసి".

"ఆఁహాఁ."

"ఆఁ కొనే వుంటారు. మిమ్ములను ఎవరో టోపీ వేశాడు. యివేం బొమ్మలండీ!"

"ఏం?"

"సరే, ఏం జెప్పేది. ఎందుకూ పనికిరానివన్నీ మీకు అంటగట్టినట్లున్నారు. చూడండి మీరు చూసే కొన్నారా ఇవన్నీ? అయ్యయ్యో! తలకు మాసినవాడు ఎవరండి మిమ్ములను అన్యాయం చేసిందీ?"

"చాల్లే యిక వూరుకో. నీకు వాటి సంగతి ఏం తెలుసునని మాట్లాడుతున్నావు? అవన్నీ గొప్ప ప్రసిద్ధులయిన చిత్రకారులు గీసిన పటాలు, కొంటే ఒక్కొక్కటి రెండు వందల రూపాలయ ఖరీదు వుంటుంది, మన బాపిరాజుగారిని అడిగి, బ్రతిమిలాడి, ససేమిరా ఇయ్యనంటే వేధించి ఇవన్నీ తెచ్చాను నీకు చూపిద్దామని."

"ఇగి ప్రఫుల్ల చంద్ర ముఖర్జీ వ్రాసింది. ఆ స్త్రీ ఒక విరహిణి. వియోగం కలిగి ప్రియాగమనానికై నిరీక్షిస్తున్నది.

ప్రొద్దస్తమానమూ ఊరిమీది తిరిగి సాయంత్రానికి కొంపకు చేరేసరికి ప్రియురాలు, ఇల్లాగ భర్త నిరీక్షిస్తుంటే ఎంత ఆనందంగా వుంటుందో ఊహించు. నేను వచ్చేసరికి నీవు యిల్లాగ వుండరాదూ? ఇదేమంత కష్టమైన పని అయినా కాదు. తెల్లని చీర కట్టుకొని, తలలో పూలు అర్థచంద్రాకారంగా చుట్టుకొని, ఆ వున్న ఆభరణాలు, గడియారం, గొలుసో, కాచికాయగుండ్లో, మెళ్లో వేసుకొని కళకళలాడుతూ వున్న

ముఖంతో కనబడుదూ, నీ గడ్డం పట్టుకొని బ్రతిమలాడుతున్నానూ.

అయితే ఆ కనబడడం ఈ బొమ్మలో వున్న మాదిరిగా కనబడాలె. చూడు, ఈ "నిరీక్షణము" నీవు కూడా మంచి చాపపైన వయ్యారంగా ఈ ఫోజులో కూర్చో. గడ్డం క్రింద చెయ్యి పెట్టుకొని మన గవాక్షంలో నుంచి చూస్తుండు.

"ఏం చూస్తుండమంటారు? వీధిలో వాళ్ళనా?"

'అదే తెలివి తక్కువ. అప్పుడు నీ చూపులు విచిత్రంగా వుండాలె. దగ్గర వున్న వస్తువులను చూస్తున్నట్లు వుండరాదు. దూరాన ఎక్కడో స్వప్నలోకంలో వున్న ఒక దివ్య దృశ్యాన్ని గమనిస్తునట్లుండి, కళ్ళు నిమీలితంగా ఉండాలె. ఆ కూర్చున్నప్పుడు నీ శరీరం కూడా చక్కని వంపులతో లావణ్యాన్ని వర్షిస్తూ నిరీక్షణ భావానికి అనుగుణ్యంగా భవిష్యత్తులోనికి సాగినట్లు వుండాలి. విన్నావా?" "ఆహా వింటూనే వున్నా. బాగానే వుంది మీరు చెప్పింది."

"అల్లాగే పిల్లలకు పాలు ఇస్తున్నప్పుడు ఈ 'పట్టితల్లి' అన్న బొమ్మలో మాదిరిగా మాతృత్వం మూర్తీభవించిన రూపులో, దృక్కులలో మాతృప్రేమ ఒలికిస్తూ కనబడాలె, తెలిసిందా!"

"పిల్లలకు పాలీయటం తెలియదండీ? నా కర్మ కాలిపోతే?" అని అంటూ తొలిగిపోయిన పమిటను సవరించుకొంది.

"పాలీయటం తెలియటం కాదు. ఆ మాదిరి భావాన్ని వ్యక్తపరుస్తూ కనబడటంలో వుంది అందమంతా" అన్నాను పళ్ళు బిగించి విసుక్కుంటూ.

"సరేలెండి. ఇదేమిటండీ. ఇందులో పిల్లతో తల్లీ వున్నారు?" అని అంటూ ఆ పసిదాన్ని దగ్గరకు తీసుకొని ముద్దాడింది.

"అది చాలా గొప్ప పిక్చర్. ప్రసిద్ధుడైన బెంగాలు కారుడు దీనిని వ్రాశాడు. దీనికి 'ది లైట్ ఆఫ్ ది హెూమ్ అని పేరు నీవు పిల్లలకు జడవేసి బొట్లు పెడుతున్నప్పుడు ఈ చిత్రంలోని పద్ధతిని అనుకరించవలసి వుంటుంది చూడు, యిందులో ఆమె ఎంత మనోహరంగా ఉందో, చుక్కల మధ్య చంద్రుడిలాగ ప్రకాశిస్తున్నది!"

"అయిదుగురు పిల్లల తల్లిని నేనింకేం ప్రకాశిస్తాను లెండి!" అన్నది ఆవిడ. అయిదు అనే మాటను నొక్కి ఉచ్చరిస్తూ.

"అల్లా అనటానికి ఏ మాత్రం వీల్లేదు. జహంగీరు చక్రవర్తి బహుసంతానవతియిన తన భార్యనునూర్‌మహల్ అని పిలిచాడు. ఏం ఫరవాలేదు. నీవు ప్రయత్నిస్తే ఇట్లాగ వుంటావు. కొంచెం శ్రద్ధ కావాలె అంతే."

సరేలెండి, ఈ బొమ్మలన్నీ ఈ మోస్తరేనా? ఇంకా ఏమన్నా మంచివి వున్నాయా?"

"అంటే, ఈ బొమ్మలన్నీ మంచివి కాదనేనా నీ అభిప్రాయం?"

"అందుకనే నాకు కోపం వచ్చేది. ఇప్పుడు నేను ఇవన్నీ మంచివి కాదన్నానా?"

"పోనీ, పాపం! మీరు ఏదో వుత్సాహంగా చెబుతున్నారు గదా అని తీరికగా కూర్చొని, శ్రద్ధగా వింటున్నందుకా ఈ మాటలు?"

"కాదులే విను, ఈ బొమ్మ చూడు. ఇది రతీదేవి చిత్రము, అద్భుతంగా వుంది."

"నిజమేనండి. ఈ బొమ్మ మట్టుకు చాలా బాగుంది. ఆ చేతులు సన్నగిల్లి వంకరపోయినై అన్నమాటే కాని."

"వంకర పోవటంకాదే పిచ్చిమొద్దూ. చేతులు అంత సన్నంగా వుండటం సౌందర్యానికి లక్షణం. చాలా బాగుంది ఈ బొమ్మ ఏమంటావు?"

"నాలుగూ పెట్టుకుంటే నేనూ అట్లాగే వుంటా."

"వుండమనే నా కోరిక. ఆ చూపులు చూడూ, ఆ యాకటి చూపులూ, ఆ సిగ్గు, ఆ నమ్రతా, ఆ లావణ్యమూ, అంతా అద్భుతంగా వుంది. శయ్యామందిరంలోకి వచ్చినపుడు నీవు కూడా ఇటువంటి భావాలను వ్యక్తపరిస్తే సజీవమైన చిత్రాన్ని జూచి నేను ధన్యుడ్ని అవుతాను" అన్నాను. నేను కళ్ళు తేలేసి గుటకలు మింగుతూ.

" అయితే మనకు శయ్యామందిరం ఏదీ?"

"అవ్వే, కుంటి ప్రశ్నలు, అందం అంతా ఆ చూపులలోనూ ఆ భావప్రకటలోనూ

వుందిగాని, శయ్యామందిరంలో వుందా ఏమిటి?"

"సరేలెండి- ఇంకా చాలా బొమ్మలున్నయ్యే" అని అంటూ ఆవలించి రెండు చిటికలు వేసింది ఆవిడ.

"ఈ బొమ్మలన్నీ నీవు జాగ్రత్తగా పరీక్షించు. మాట్లాడేటప్పుడు, పడుకున్నప్పుడు, కూర్చున్నపుడు ఎట్లా ఉంటే అందమో, ఆ వంపులు, ఆ హస్తవిన్యాసాలు, ఆ భంగిమలూ అవన్నీ చూపిస్తూ వున్న అజంతా చిత్రాలు తెచ్చాను. నిలుచున్నపుడు సాధారణంగా ఇట్లా నిలుచుంటే అందము."

"ఇట్లాగా, ఇట్లా కడుపులో నొప్పితో బాధపడుతున్నట్లుగానా."

"పిచ్చిమొద్దువు నీకేం తెలుస్తుంది? అది అద్భుతమైన ఫోజు. ఆ భంగిమాన్ని త్రిభంగి అంటారు. మాట్లాడేటప్పుడు ఇల్లా చెయ్యిన. ఎత్తి చూపాలే. ఈ హస్తాన్ని మృగశీర్షికమంటారు. ఎందుకు? ఎట్లు? అన్న పశ్నలకు ఈ హస్తము ప్రసిద్ధం."

"అయితే ... నాకూ తెలియక అడుగుతాను... ఎందుకండీ యివన్నీ? మనం మామూలుగా నిలుచున్నట్లు నిలుచుంటే అందం లేదు?"

"ఇందులో ..... ?"

"గొప్ప అందము, లావణ్యము వుంది."

"ఓహెూ తెలియకే అడిగాను లెండి!"

"చెపుతున్నాగా విను. పోనీ నన్ను సంతోషపెట్టడానికైనా ఇట్లా చెయ్యి."

"చేస్తాను లెండి!"

"చూశావా నేను అదృష్టవంతుడినే! నా యిల్లు ఒక చిత్రశాల అవుతుంది. తప్పకుండా అవుతుంది. సజీవ చిత్రములతో కూడిన చిత్రశాల అవుతుంది. తప్పకుండా అవుతుంది, ఈ చిత్రాలను అనుకరిస్తావా?"

"అనుకరిస్తాను లెండి. పోనీ మీకంత సరదాగా ఉంటే, అయితే మీతో మాట్లాడుతున్నపుడు మాత్రమే. ఇంక ఎవరితోనైనా మాట్లాడుతున్నపుడు మట్టుకు ఈ

చిలిపి చేష్టలు నేను చెయ్యను సుమండీ."

కాంతం నా అభిలాషలన్నీ విని ఆమోదించినట్లు కనపడి, సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తానని కూడా వాచా అన్నది. ఇంకేం కావాలి నాకు? నేను పరమానందభరితుడ్ని అయినాను.

అంతేకాదు, నికరంగా, పూర్తిగా, అమందానంద కందళిత హృదయారవిందుడ్ని అయినాను. అతిశయోక్తి ఇందులో ఏమీలేదు. అంతపనీ జరిగింది.

అమిత సంతోషం కలిగి, ఆవిడ పనుందని వంట యింట్లోకి వెడితే, వెంటబడి వెళ్ళి అన్నం పెట్టేటప్పుడు "ది యంగ్ హొస్టెస్" బొమ్మను అనుకరించమనీ మాట్లాడుతూ నిలుచున్నప్పుడు "ది పర్‌ఫెక్ట్ వైఫ్" బొమ్మను అనుకరించమనీ చెప్పి ఇరవైనాలుగు హస్తజాతులూ, ముద్రా విశేషాలు ఆవిడకు చూపించాను. వివిధాలంకారాలతో అలంకరించుకొని భర్తను సంతోషపెట్టడమే పరమావధిగా నిర్మించుకొనటం సనాతన మత ధర్మసమ్మతమని, కామసూత్రాలు అచ్చు పుస్తకం కాంతానికి చూపి, ఎంతో నచ్చజెప్పాను.

ఆ మరునాడే నే జెప్పిన విషయాలు ఆచరణలో పెట్టబడటానికి నిర్ణీతమైంది. కాంతం కూడా సమ్మతించింది.

సాయంత్రం ఇంటికి వస్తూన్నాను.

ఈ పాటికి కాంతం ఏ ఫోజులో వుంటుందా అని సందేహం కలిగింది. తప్పకుండా నిరీక్షణలో వుండవచ్చునని తోచింది. ఆ సాయంత్రం చాలా రమణీయంగా కూడా వుంది. అల్లా అనుకొని ఉవ్విళ్ళూరిపోయినాను. గుటకలు మింగాను. కళ్ళు తేలేసి భావనాకాశంతర్భాగాన, ఒక దివ్యదృశ్యాన్ని మనశ్చక్షువుతో చూడగలిగాను. స్వర్గానికి పోతూన్న జీవివలె సంతోషంతో తూలిపోయినాను. తనువు పులకరించింది. తేలికయై మేఘపు తునకలాగా గాలిలో తేలిపోతూ ఇంటికి వచ్చాను.

తలుపు వేసి వుంది!!!

కిటికీలో నుంచి చూశాను దడదడ కొట్టుకుంటోన్న గుండెతో.

"లేదు ... గవాక్షం పక్కలేదు ....... నిరీక్షిస్తూ లేదు!!!"

పోనీ, ఇంట్లో పిల్లలమధ్య చక్కని చుక్కలాగ కూర్చుని "ది లైట్ ఆఫ్ ది హెూమ్" పద్ధతిలో ఉందా.

లేదు మహాప్రభూ, లేదు!!!

రతీదేవిలాగ వుండవలసిన సమయం కాదది.

ఇంక మరి ఏ పద్ధతిలో వుంది?

ఏం జెప్పేది! ఆవిడ పద్ధతి ఆవిడదే. నిలువునా నీరైపోయినాను. తెప్పరిల్లి,

"తెల్లచీరైనా కట్టుకోలేదేం?" అన్నాను ఆర్చుకు పోయిన పెదవులను నాలుకతో తడిచూస్తూ.

"బోగందాన్నటండీ. ప్రొద్దుగూకేసరికి చీర సింగారించుకొని వీధిలో నిలవటానికి?" అన్నది, అదేదో ఒక రకం స్వరంతో. అది ఏమి స్వరమోగాని నా హృదయంలో మాత్రం తకిట ధోం... ధోం... తకిట...కిట..ధోం.., దధకిట..తకిట. ధోం తకిట.. ధోం అని మృదంగ నినాదం బయలు దేరింది."

"అయితే నేనూ ...... నీకూ ..... చెప్పి బోధించిన ప.... ప....పద్ధతులలో ఇపుడు నీవు ఏ ఏ పద్ధతులలో వున్నట్లు" అన్నాను గుండెలమీద చెయ్యి అదిమిపెట్టి.

"ఏ పద్ధతి ఏమిటండీ- మన పద్ధతే! మీదంతా అదో విచిత్రమూ" అన్నది. ఆవిడ నా ఆదుర్దాను అంతా వుదాసీన భావంతో తోసేసింది.

కాసేపు అట్లాగే నిలబడ్డాను. నోట మాటలేదు. కంట చూపులేదు.

ఆలోచనా ధూమ సముద్రంలో ఊపిరాడక క్షణం సేపు కొట్టుకుని తెప్పరిల్లి,

"చక్కగా అలంకరించకోనైనా లేదేం" అన్నాను.

"ఏమి అలంకరించుకొనేది? మీరు పెట్టిన ఏడువారాల సొమ్ములున్నాయి గనుకనా? అట్లా దొడ్లోకి రండి .. మాట్లాడుకుందాం సరదాగా, చెయ్యి వూరుకోలేదు" అన్నది.

నేను పడుతున్న అవస్థ ఆమెకు ఈషణం మాత్రం కూడా తెలసినట్లు కనపడలేదు. ఇక తెలిసి కూడా నా అవస్థను ఉన్మాద విశేషం క్రింద జమకట్టి, సౌందర్యాన్ని గురించి నాకు గల భావాలను తృణీకరిస్తూన్నదేమో నాకు తెలియదు. పైగా దొడ్లోకి వెళ్ళి సరదాగా మాట్లాడాలట!

కూలబడిపోయినాను కుర్చీలో నారాయణ స్మరణ చేస్తూ. "ఇప్పుడేం చేయాలి" అన్నది పెద్ద? అయిపోయింది. ఆలోచించాలని ప్రయత్నించాను. కాని అదేమి చిత్రమోకాని నాతల మొద్దుబారి, గ్రీకు కథలలో చెప్పినట్లుగా, ఇనుపముద్ద అయిపోయింది.

అరగంట గడచిన తరువాత మెల్లగా, జలాశయంలో చిరుగాలికి జన్మించే అలలాగ, రెండు మూడు ఆలోచనలు తట్టినవి.

మొదటిది ఆమెను కోప్పడితే లాభం లేదన్న విషయము, కోపపడి సాధించే విషయంకాదు ఇది.

రెండవ ఆలోచన, ఆమెను బ్రతిమిలాడితే ఏమన్నా లాభం వుంటుందా అన్న సందేహం. ఇదివరలో నేను బ్రతిమిలాడగలిగినంత బ్రతిమిలాడాను. ఇంక అటువంటి పనివలన ప్రయోజనం లేదని తోచింది.

కుర్చీలోనుంచి లేచి దొడ్లోకి వెళ్ళి – ఆమెవంక తేరిపార జూచి, పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకొని "ఆ జుట్టుముడి ఏమిటి? అట్లా వున్నది?" అన్నాను. వేణీబంధాలను చిత్ర విచిత్ర రీతులలో చూపిస్తున్న ఒకటి 'కృష్ణాపత్రిక'లో ప్రచురించారు. దాన్ని సంపాదించే ఆవిడకు ఇచ్చాను. ఇందులో చూపెట్టిన పద్ధతులలో వేణీబంధాలను సవరించుకోమని ఇదివరలో చాలా కాలాన్నుంచి చెపుతూ వున్నాను.

"దీనికేం ఇది బాగుండలేదా" అన్నది, తన జడ చుట్టను ముద్దుబిడ్డను నిమురుతున్నట్లు నిమురుతూ. ఇంకేం అనేది? కూలింది హిమాలయపర్వతం కూలింది. దభేలున కూలింది!

నేనో!

విచారవేదనా దోధూయమాన మానసుడనై శుష్య దోష్టడనై, నిదాఘ

శుష్కపత్రంబువోలె అనార్ద్రగళుండనై అంతఃప్రవిష్ట నయనుండనై

ప్రభాత శశికళా పాండుముఖచ్ఛాయుండనై

వికీర్ణ హ్రస్య కేశపాశుడనై

దుఃఖీలున మళ్ళీ కుర్చీలో కూలబడ్డాను. ఆ జుట్టుముడి చూస్తేనే కాని నా నిస్పృహకు కారణం తెలియదు.

ఆమెను... నేను ...అప్పుడు ...చూచినప్పుడు ... ఉన్న రూపం... చూస్తేనేగాని నా దీనవస్థను మీరు మనోవీధిలో చిత్రించలేరు!!

కట్టుకొన్నది ...................... బీరాకు రంగు చీర -- చేతిలో ................. తోముతున్న కంచు దుక్కచెంబు చేతినిండా ................. చింతపండు.

మొఖాన ..... కానీడబ్బంత కుంకుమబొట్టు మొత్తం -- పరమ ఎంకమ్మ స్వరూపం. ఇక జుట్టుముడి సంగతి!!

ఆ బొమ్మలో చూపిన పద్ధతులు ఒకటీ ఆవిడకు నచ్చలేదు కామాలు, ఆ పద్ధతుల ఛాయకే పోలేదు.

కొండీ చుట్ట అయినా కాదు అది!

పోనీ ముచ్చటపడి అయినా కాదు!

నడినెత్తికి శిఖరంలాగ జడచుట్ట వచ్చేటట్టు చుట్టబడిన పరమ అసహ్యపు దరిద్రపు గొట్టు ముడి అది!

దాని ఆకారాన్ని బట్టి, దానికి మా కొంపలో ఇది వరలోనే చేయబడిన నామకరణం పిడక చుట్ట.

నేను కూర్చున్న చోటునుంచి లేవలేదు. అల్లాగే కూర్చున్నాను నా కుర్చీలో, కళ్ళు మూతలు పడ్డాయి. వళ్ళు నీరసించిపోయింది. ఆ నిస్పృహలోనుంచి నిద్రా లోకంలోకి మెల్లగా జారాను.

ఏమిటి నేను అపుడు స్వప్నావస్థలో చేస్తున్నది?

ఒక పెద్ద పిడక చుట్ట,

తరువాత రెండు,

జతలు జతలుగా పిడక చుట్టలు,

మూడు మూడు,

నాలుగు నాలుగు,

అయిదు అయిదు,

గుంపులు గుంపులుగా,

తండాలు తండాలుగా, ఒక పిడక చుట్టసేన మా కొంపను ముట్టడి వేస్తున్నది.

లోకంలో వున్న పిడక చుట్టలన్నీ వచ్చేస్తున్నాయి.

కాంతం అన్నానికి పిలవటంవల్ల కళ్ళు తెరవ సంభవించింది. కళ్ళు నలుపుకొని లేచి ముఖం, కాళ్ళు కడుక్కొని, మడి గట్టుకొని భోజనానికి కూర్చున్నాను.

కాంతం ముఖం మామూలు సౌందర్యంతో విలాసంగానే వున్నది. కాని వెనకవైపున వున్న జుట్టుముడిని చూడటానికైనా బలం లేనంత భీరువునయిపోయినాను నేను. నా హృదయంలో పుట్టిన సౌందర్యతృష్ణకు తృప్తి కలగకపోవటం మూలాన, జన్మించిన తాపంతో, కృంగి కృశించిపోతూ, భోజనం పూర్తిచేశాను.

నా గదిలోనికి వెళ్ళాను. అదే నేను చదువుకొనే గది. అదే నా పడకగదికూడాను. రతీదేవి బొమ్మ ముందుంచుకొని అందున్న సౌందర్యాన్ని చూచి ముగ్ధుడనైపోతూ, ఆ బొమ్మ వ్యక్తపరుస్తున్న భావాలను ఊహిస్తూ, సౌందర్యాన్ని ఉపాసిస్తూ కూర్చున్నాను. ఎంతసేపు అల్లా కూర్చున్నానో తెలియదు.

చివరకు మా ఆవిడ రాక నా ధ్యానానికి భంగం కలిగించింది. ముక్కు తీరులోగాని, పెదవుల కుదిరకలోగాని, కళ్ళ సౌందర్యంలోగాని మా కాంతంలో లోటు నాకు ఏమీ కనిపించలేదు. వస్త్రధారణలో కొంచెం శ్రద్ధ, చూపులలో రవ్వంత

తీవ్రత వుండి, ఆమె హృదయాంతర్భాగంలో వున్న భావాలు ప్రతి అవయవము వ్యక్తపరిచేటట్లు చేస్తే, ఆమె పూర్తిగా రతీదేవి అయిపోను.

నా కోరిక మన్నించదాయె. నా ఆందోళన అర్థం చేసుకోదాయె. జుట్టుముడియైనా మార్చదాయె.

నేను ఆమెవంక ఒక్క నిమిషనం జూచి ఒక్క నిట్టూర్పు విడిచి, మళ్ళీ రతీదేవి చిత్రాన్ని చూస్తూ తల వంచుకున్నాను. నేను చెప్పినట్లు ఆమె చేసింది కాదని నాకు కోపంగా వున్నమాట నిజమే.

ఆమె మెల్లగా అద్దం ముందుకు వెళ్ళి తన జుట్టుముడిని విప్పి, మరొక రకంగా సవరించి, పైన చక్కని చామంతి పూలదండ అర్థచంద్రాకారంగా చుట్టింది. నేను ఇది గమనించి నవ్వాను. ఆమె కూడా నవ్వింది. నేను ఆమె ముఖం చూడకుండానూ ఆమె నా ముఖం చూడకుండానూ ఈ బేరం జరిగిపోయింది. ఆ అద్దం మా ఇద్దరి మధ్య రాయబారం జరిపి రాజీ కుదిర్చింది.....

"అయితే నా మాట వినదల్చుకోలేదన్నమాట" అన్నాను. ఆవిడను ఎట్లాగైనా నా కోరికను అనుసరించి ప్రవర్తించేలాగున చేద్దామన్న ఆశతో.

"మీ మాట వినకపోతే ఎవరిమాట వింటానండీ? వినక ఏం చేశాను చెప్పండి?" అన్నది." నమ్రతతో -- సంతోషించాను -

"అయితే, ఈ బొమ్మను అనుకరించలేదేం" అన్నాను రతీదేవి చిత్రాన్ని చూపిస్తూ.

"అనుకరించాల్సిన అవసరం లేదు. నేను అసలు రతీదేవి లాగనే వున్నాను. అంతకంటే కూడా కొంచెం బాగానే వున్నానేమో!" అన్నది చిరునవ్వును మృదువైన మాటతో కప్పిపెట్టి.

"ఆకారంలో రతీదేవిలాగ నీవు వున్నావు అని నేను ఎట్లా ఊహించుకోగలను? ఉంది లోపం నీలో. ఆ లోపం నీ చూపులలో తీవ్రతవల్లా, చక్కని ఫోజు ఇచ్చి పోగొట్టుకోరాదూ?"

"మీరేం ఫోజు ఇచ్చారు? మీరు, ఏం హస్తాలు పట్టారు? మీరు ఏ చిత్రాన్ని

అనుకరిస్తున్నారు? అంటే కోపంగాని, ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి."

.........

మీరు ఇంటిలోకి రావటంతోనే, రాజు వెడలెను అనే పద్ధతిలో హాలులో కాసేపు ఎగిరి దొడ్లోకి రండి. దాని తరువాత "ది పర్‌ఫెక్ట్ హజ్‌బెండ్" అనే బొమ్మను అనుకరిస్తూ నిలుచోండి. సింహతరాట హస్తం పట్టండి – మీరు అట్లాగ చెయ్యండి. నేనూ మీరు చెప్పినట్లు చేస్తాను.

.........

"అదేమిటండీ అల్లాగా తెల్లపోయి చూస్తున్నారు. హస్తాలు మిమ్మలను పట్టమన్నాననా?"

...............

"అయితే ఒకటి, ఏమి చెయ్యకపోయినా, నా కళ్ళకు మీరు మన్మథుడిలాగ కనబడుతున్నారు" అన్నది ఆవిడ నా మెడపైన తన చేతులు వేసి బ్రహ్మాండమైన అర్థాన్ని ఈ మెత్తని మాటలతో మాటు పెట్టింది.

"నేను నీకు మన్మథుడిలాగ కనబడుతున్నానూ?" అన్నాను నేనూ, దురదపుట్టిన మణికట్టును గడ్డానికేసి రాస్తూ.

"ఎందుకు కాదూ? తప్పకుండా కనపడుతున్నారు?" అన్నది.

"ఎందుకు అంటావు అల్లాగ? నాకింకా తెలివితేటలు పోలేదు. ఈ పొగడటాలు నన్నేమీ సంతోషపెట్టవు. తెలుసునా!" అన్నాను గంభీరంగా. అద్దం దగ్గిరివెళ్ళి లెవెండరుతో తల తుడుచుకొని దువ్వెనతో పాపట తీసుకొని సాధ్యమైనంత అందంగా దువ్వుకొంటూ, ఆవిడ నావంక చూస్తూ, నా చేష్టలను గమనిస్తూ కొంచెం సేపు నిలబడ్డది. చప్పునవచ్చి నా చేతిలోని దువ్వెన లాక్కుని నేను తీసుకొన్న పాపట చెరిపి ఒక చేత్తో దువ్వెన పట్టుకొని చక్కగా పాపట తీర్చి మళ్ళా దువ్వెన నా చేతికిచ్చేసింది నవ్వుతూ.

నేనూ వెనకా ముందూ చక్కగా దువ్వుకొని, చేత్తో సర్దుకొని, మళ్ళీ మా

కాంతంవంక చూశాను.

"నేనన్నమాట అబద్ధమనీ ఇప్పటికీ అంటారా" అన్నది మెరుస్తున్న కళ్ళతో, ఏదో ఒక కొత్త వస్తువును చూస్తున్న దానిలాగ నావంక చూస్తూ.

"ఆc, నీవన్నది వట్టిమాట. ఇవన్నీ బొల్లికబుర్లు నాకంత మాత్రం తెలియదనుకొన్నావా" అని గర్జించాను. ముఖానికి హేజలైన్ స్నో కొద్దిగా రాచి అరచేతులతో ముఖాన్ని కలయరుద్దుకొంటూ "ఉన్నారండీ! మీరు నవమన్మథుడిలాగ వున్నారంటే నమ్మరేం! – నా కళ్ళకు అట్లాగే కనపడుతున్నారు" అన్నది. ఆవిడ జవ్వాజి కొంచెం తీసి మెడ క్రిందా, వక్షస్థలానికి పులుముకుంటూ.

నేను అప్పటికి ధోవతిమార్చి పెట్టెలో నుంచి షర్టు కూడా తీసుకొని వేసుకొన్నాను. తళతళలాడే బంగారపు గుండీలు పెట్టుకొని కొద్దిగా వాసన నూనె మీసాలకు పూసి దువ్వుతున్నాను మెరుగుకోసం.

"అయితే నేను రతీదేవిలాగ లేనండి" అంటూ ఆవిడ కూడా అద్దం దగ్గరకు వచ్చింది.

ఏం జెప్పాలి.

మధ్యవర్తిని అడగాలె, ఏ తగాదా అయినా పరిష్కారం కావాలంటే –

ఇద్దరం ఒకరిపక్కన ఒకరు నిలుచుని అద్దాన్ని తీర్పు జెప్పమన్నాము. క్షణం పట్టింది తీర్పు వినటానికి.

గిరుక్కున కాంతంవైపు తిరిగి, "వున్నావు, నిజంగా రతీదేవిలాగ వున్నావు" అన్నాన్నేను. నేను ఆవిడ మెత్తని భుజాలపైన చేతులు వేశాను. ఆమె నా ముంజేతి గుండీలను సవరిస్తూ నిలబడిపోయింది.

ప్రొద్దున్న తొమ్మిదిగంటలకల్లా నేను భోజనంచేసి, జట్కానుపిలిచి, అందులో పుస్తకాలు పడేశాను. ఇక ఎక్కబోతున్నాను.

"చూడండీ, అమ్మాయి తెస్తున్నది. దబ్బున అందుకోండి ఆ బొమ్మలు. ఖరీదుగల బొమ్మలు కామాలు, మనకు లాభంకాని పనులు మనం చెయ్యకూడదు కానీ....

అవన్నీ తీసికెళ్ళి ఆయన కిచ్చేసెయ్యండీ” అని చెప్పి పిల్లను గడప అవతలకు లాక్కుని తలుపు వేసుకుంది.

“పోనియ్యవోయి బండి – ”అన్నాను.

ఎత్తుపల్లాలు గలిగి, దుమ్ములోనుండి మేకుల్లాగ, కాళ్ళలో దిగబడే కంకర రాళ్ళు వున్నటువంటి ఆ రోడ్డుపైన, బండి నడుస్తూ కటకట శబ్దం చేస్తూవున్న ఆ జీవితానికే అలవాటుపడి, అందులోనే ఆనందాన్ని అనుభవించటం నేర్చుకొన్న ఆ గుర్రం మహా హుషారుగా ఎగురుతూ, సకిలిస్తూ తన యజమాని వేసే ఈలలకు పరవశత్వం పొందుతూ పరుగెత్తింది.

(1962)